క్లుప్తంగా

ఉత్తమ పురస్కార గ్రహీతలకు సన్మానం


అందకూర్‌లో సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల: గణతంత్ర వేడుకల్లో భాగంగా ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీమ్, ఏఈవో శ్రీధర్‌లు ఇటీవల ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. శుక్రవారం వీరిని అందకూర్, ఓలా గ్రామాల్లో సన్మానించారు. సర్పంచ్ దాసరి కిషన్, కనీస్‌ఫాతిమా, ఎంపీటీసీ మధుకర్, మాజీ కోఆప్షన్‌సభ్యుడు హైమద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఖానాపూర్: ఇటీవల అంతర్జాతీయ అండర్ ఆర్మ్ మహిళ క్రికెట్ పోటీలకు ఎంపికైన యువతి జక్కుల నిఖితకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.9 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటుచేసిన సమావేశంలో నగదును అందించారు. ఆర్థికస్థోమత లేక క్రీడాపోటీలకు వెళ్లలేని పరిస్థితి ఉన్నందున తమవంతు సహకారం అందించినట్లు పేర్కొన్నారు. సభ్యులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, జితేందర్, కేహెచ్ ఖాన్, కిరణ్‌కుమార్, భూపతిరెడ్డి, సుదర్శన్, సంజీవ్‌రావు, అల్వాల హన్మంతు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలతో శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు

ముథోల్: గతనెలలో సిద్దిపేట జిల్లా తాడ్కపల్లిలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ముథోల్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ పాఠశాల సమితి కార్యదర్శి ధర్మపురి సుదర్శన్ శుక్రవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడెం: జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్‌లో మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రవళిక, ప్రసన్నను శుక్రవారం ఉపాధ్యాయులు, నాయకులు సన్మానించి, అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ బాలవ్వ, హెచ్‌ఎం వామన్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజనర్సయ్య తదితరులు ఉన్నారు.

శివాలయంలో పూజలు


పూజలు చేస్తున్న పవార్ రామారావు పటేల్

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలోని శివాలయంలో శుక్రవారం ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముథోల్ బీజేపీ సీనియర్ నాయకుడు పవార్ రామారావు పటేల్ హాజరై ఆలయంలో పూజలు చేశారు. గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. ఆయన వెంట లోకేశ్వరం ఎంపీటీసీ జయసాగర్‌రావు, నాయకులు బద్దం గంగారెడ్డి, నవీన్, సాయన్న, విలాస్, వెంకట్‌రెడ్డి, మంద భాస్కర్, ముత్యం, కమలబాయి, రాజమణి, అనిల్, పోశెట్టి, బర్ల రవి, అంజగౌడ్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలోని శ్రీ సంత్ సేవాలాల్, జగదాంబదేవి ఆలయ నిర్మాణానికి టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్యాంనాయక్ శుక్రవారం భూమిపూజ చేశారు. బంజారా సమాజ ఐక్యత కోసం ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.

శబ్దాలతో పరార్

- పంటల రక్షణకు రాత్రివేళ మైక్‌లతో అరుపులు
- చేన్ల చుట్టూ పాత చీరెలు
- అడవి పందుల బారి నుంచి కాపాడేలా చర్యలు


దాగాంలో పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన సోలార్


ఎల్వి గ్రామంలో పంట చుట్టూ ఏర్పాటు చేసిన చీరెలు

తానూరు: అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో యాసంగిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న, వేరుశనగ, జొన్న, కూరగాయల పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న కాడదశలో విత్తు ముదరుతున్న దశలో, విత్తు పోసుకునే దశలో ఉంది. పంటలు కాపాడుకునేందుకు క్రూరమృగాల అరుపులు, సౌండ్‌ను రికార్డింగ్ చేసి రాత్రివేళ మైక్‌ల ద్వారా శబ్దాలు చేస్తే పరార్ అవుతాయని వ్యవసాయ అధికారులు(ఏఈవో) పేర్కొంటున్నారు.

పొలాల చుట్టూ చీరెలు

పొలాల చుట్టూ కర్రలను పాతి, పాత చీరలను గోడల వలే కట్టాలి. అడవి పందులు రాత్రివేళ పంటలపై దాడి చేసినప్పుడు చీరల స్పర్శ తగలి మనుషులు ఉన్నట్లు భ్రమపడి భయంతో అరుస్తు దూరంగా పరుగెత్తుతాయి. క్షౌరశాలలో లభించే వ్యర్థమైన వెంట్రుకలు సేకరించి, పొలాల్లో గట్ల చుట్టూ ఒక్క అడుగు వెడల్పు ప్రాంతాన్ని చదును చేసి వెంట్రుకలను పల్చగా చల్లాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

రాత్రివేళ శబ్దాలు

అడవి పందుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు పటాకులు, కేకలు ఖాళీడబ్బాలతో శబ్దాలు చేయాలి. క్రూరమృగాల, కుక్కల అరుపులను రికార్డింగ్ చేసి మైక్‌ద్వారా రాత్రిసమయంలో పొలంలో పెట్టాలి. పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు కాకుండా సోలార్ తీగలు అమర్చుకోవాలని సూచిస్తున్నారు. వాటిని అమర్చుకోవడంతోపాటు అధిక మంది రైతులు పాత చీరలు చుట్టి, మైక్‌లో రాత్రివేళలో వివిధ రకాల శబ్దాలతో పంట రక్షణ చేపడుతున్నారు.

పంటల చుట్టూ..

వేరుశనగ పంట చుట్టూ 4–5 వరుసలు కుసుమ పంటను దగ్గర చేస్తే వాటికి ఉండే సన్నని ముళ్ల వల్ల అడవిపందులు వచ్చి ముట్టితో భూమిని తవ్వడానికి ప్రయత్నించినప్పుడు ఆ ముళ్లు గుచ్చుకుని తీవ్ర నొప్పి వస్తుంది. దీంతో అడవి పందులు తవ్వవు. మొక్కజొన్న చుట్టూ 4–5 వరసలతో ఆముదపు పంటను దగ్గరగా వస్తే ఆ వాసనకు జొన్న వైపు రావని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



యాసంగిలో మొక్కజొన్న, వేరుశనగ, శనగ, పెద్ద జొన్న పంటల రక్షణ కోసం రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పంటలకు అడవి జంతుల బారి నుంచి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం.

– పవన్, ఏఈవో

ఈరోజు

నేటి నుంచి ముజ్గి మల్లన్న జాతర


ముజిగి మల్లన్న ఆలయం

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గి గ్రామంలో కొలువైన మల్లన్న ఆలయ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు సర్పంచ్ పాలాస రాజమణి, గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం స్వామివారి కల్యాణం, 5వ తేదీ సాయంత్రం సల్లకుండల ఊరేగింపు, 6న మధ్యాహ్నం రథోత్సవం, 7న స్వామివారికి నాగవల్లి, చివరి రోజైన 8న అగ్నిగుండం కార్యక్రమం నిర్వహిస్తారు. నిర్మల్ మండలం నుంచేకాక సోన్, సారంగపూర్, లక్ష్మణ్‌చాంద, భైంసా, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. ఇప్పటికే స్వామివారి పల్లకి ఊరేగింపు పూర్తయి గ్రామానికి చేరుకుంది. రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తన నివాసంలో స్వామివారి పల్లకీకి పూజలు చేశారు.

ముత్యాల పోచమ్మ ఆలయ ప్రత్యేక సమావేశం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో గల శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక సమావేశం ఉంటుందని ఆలయకమిటీ అధ్యక్షుడు నాగేందర్‌రావు, గౌరవ అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. పట్టణవాసులు, భక్తులు హాజరుకావాలని కోరారు.

మల్లన్న జాతర

ముథోల్: మండల కేంద్రంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శనివారం నుంచి మల్లన్న జాతర కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం కుస్తీ పోటీలను గ్రామకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, మల్లన్న ఆలయానికి భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి తరలిరానుండున భైంసా ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.

ఆలయం ముస్తాబు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌లో మల్లన్న జాతరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శనివారం కల్యాణం, ఆదివారం సల్లనంబల్లు, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీడీసీ చెర్మన్ గంటగారి రాజారెడ్డి తెలిపారు. భక్తులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థిని కుటుంబానికి పరామర్శ

లక్ష్మణచాంద: సారంగాపూర్ మండలం జామ్‌లోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని మహిత శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోన్ మండలం పాక్‌పట్ల గ్రామానికి రాత్రి చేరుకుని మహిత పార్థివదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ముత్యం రెడ్డి, సోన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మార గంగారెడ్డి, నాయకుడు సరికెల గంగన్న తదితరులు ఉన్నారు.


కుటుంబీకులను పరామర్శిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

'కళాతపస్వి'కి నివాళి


నివాళులర్పిస్తున్న 'పాటే మాప్రాణం' సభ్యులు


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

- నివాళులర్పించిన మంత్రి అల్లోల
- విశ్వనాథున్ని తలచుకున్న పలు సంఘాలు

నిర్మల్: కళాతపస్వి, ప్రముఖ సినీ దర్శకుడు కె. విశ్వనాథ్ మరణంపై జిల్లావాసులూ తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. నాందేడ్ సభ ఏర్పాట్లలో ఉన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. విశ్వనాథ్ మరణం తెలుగు సినీరంగానికి తీరని లోటన్నారు. భారతీయ, తెలుగు సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ సంగీతం, కళలను కథలుగా ఎన్నో అద్భుత సినిమాలు తీశారని కొనియాడారు. విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

పాటే మాప్రాణం ఆధ్వర్యంలో..

కళాతపస్విగా సినీ,కళారంగాలకు కె.విశ్వనాథ్ చేసిన సేవలు ఎప్పటికీ మరిచిపోలేమని, ఆయన తీసిన సినిమాలు, పాటలు కళాఖండాలని పాటే మాప్రాణం సంగీత అకాడమీ బాధ్యులు కొనియాడారు. జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్‌లో గల కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఇందులో పాటే మాప్రాణం అకాడమీ డైరెక్టర్లు నాగరాజు, రంజిత్‌కుమార్, సభ్యులు నవీన్‌సురాణి, వాసర శ్రీకాంత్, సల్మాన్, కళాభిమాని డా.కత్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: కళాతపస్వి, దర్శకుడు కె. విశ్వనాథ్‌కు శుక్రవారం మండలంలోని రాజురా గ్రామంలో గ్రామస్తులు నివాళులర్పించారు. న్యాయవాది వెంకటరమణ, గ్రామస్తులు గడ్డం రవీందర్, గంగన్న, మల్లేశ్, మహేశ్, రాజు, నరేశ్, సత్యారావు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా గజ్జలమ్మ కల్యాణం


కల్యాణ తంతు జరిపిస్తున్న వేద పండితులు


తిలకిస్తున్న మహిళలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. పండితుల వేద మంత్రోచ్ఛరణాల మధ్య నిర్వహించారు. శ్రీగురుమంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో నిత్యనిధి, యజ్ఞం, హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం నిర్వహించిన రథోత్సవంలో మహిళలు మంగళహారతులతో అధికసంఖ్యలో పాల్గొన్నారు.

మరెమ్మ దేవి విగ్రహప్రతిష్ఠాపన


హోమంలో పాల్గొన్న భక్తులు

తానూరు: మండలంలోని దాగాం గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన మరెమ్మ ఆలయంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం హోమం నిర్వహించారు. తర్వాత అర్చకుల వేద మంత్రోచ్ఛరణాల మధ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు ఆలయంలో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సావిత్రి బాయి, నాయకులు సాయినాథ్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడి తెప్పోత్సవం

కడెం: అక్కకొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ సమీపంలోని గోదావరిలో స్వామివారి ఉత్సవమూర్తులకు అర్చకులు పూజలు చేశారు. ఈనెల 5న రథోత్సవం, జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బుర్ర రాజారమేశ్ గౌడ్ పేర్కొన్నారు.

పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల శ్రీ వెంకట లక్ష్మీనర్సింహస్వామి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శనివారం కుంకుమార్చన, ఆదివారం ప్రతిష్ఠాపన, అన్నదానం ఉంటుందని ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న మహాలక్ష్మి జాతర


పూజలు చేస్తున్న భక్తులు


కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

కుభీర్: మండలంలోని రంజిని గ్రామంలో గత మూడురోజులుగా మహాలక్ష్మి జాతర కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతకు రూ.5 వేలు అందించగా ద్వితీయగా నిలిచిన వ్యక్తికి రూ.3 వేలను ఆలయ కమిటీ సభ్యులు అందించారు. రంజిని పల్సి, పార్డి(కే), జాన్‌గాం, కుభీర్ గ్రామాల భక్తులతోపాటు, మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. గ్రామపెద్దలు దేవేందర్ ఉత్తం, నాయకుడు అనిల్ తదితరులు ఉన్నారు.

కంటివెలుగు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని రెండో వార్డు పరిధిలోని శివాజీనగర్‌లో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు కోరారు. శుక్రవారం శివాజీనగర్‌లో కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కంటి వెలుగు కార్యక్రమాన్ని తహసీల్దార్ కవితారెడ్డి, ఎంపీడీవో మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్యురాలు శ్వేత, కంటి వైద్య నిపుణుడు లక్ష్మణ్, వైద్య సిబ్బంది యాస్మిన్, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ భోజాబాయి ప్రారంభించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, వైద్యులు వృద్ధిరెడ్డి, దామోదర్, మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల, పంచాయతీ సారిక తదితరులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆశ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి

తానూరు: విధులకు వెళ్తూ బైక్‌లో కొంగు చిక్కుకుని కిందపడి మృతిచెందిన ఖర్బలా ఆశ కార్యకర్త గాడేకర్ ఉజ్వల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఖర్బలా గ్రామానికి చేరుకుని ఆమె కుటుంబీకులను పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.50 లక్షల అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు పిల్లల ఖర్చులను భరించాలని డిమాండ్ చేశారు. నాయకులు డాకుర్ తిరుపతి, గైనే మురళీమోహన్, జాన్‌పాల్ మోడుపు తదితరులు ఉన్నారు.


బాధిత కుటుంబీ సభ్యులతో మాట్లాడుతున్న నూతన్‌కుమార్

ముగిసిన సమ్మక్క-సారలమ్మ జాతర

ముథోల్: మండలంలోని ఎడ్‌బిడ్ తండా గుట్టపై మూడు రోజులుగా కొనసాగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర శుక్రవారంతో ముగిసింది. భక్తులు తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల వద్ద కోళ్లు, మేకలతో వచ్చి మొక్కు తీర్చుకున్నారు. ఆలయస్థాపకులు రేణుకమ్మ, సత్యవతి, సతీశ్‌లు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.


గద్దెల వద్ద భక్తులు

చేపపిల్లల పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని న్యూకంజర్, బోరిగాం గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. తోటల్లోని బావులు కలిగిన రైతులకు ఒక్కొక్కరికి 80 చేప పిల్లల చొప్పున అందజేశారు. న్యూకంజర్‌లో 10 మంది, బోరిగాంలో 6 ఆరుగురు రైతులకు 1280 చేప పిల్లలను అందించారు. డీపీవో లక్ష్మణ్, ప్రోగ్రామ్ ఫెసిలిటేటర్ చిన్నయ్య, ఈడబ్ల్యూ వినోద్, రోహిదాస్, వీడీసీ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

తానూరు: పరిసరాల శుభ్రత పాటించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండలంలోని తొండాలా, జౌలా(బి), ఖర్బాలా, దౌలతాబాద్ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ప్రతిరోజు గ్రామాల్లో పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి ఎరువులను తయారీ చేయాలన్నారు. మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలన్నారు. ఖర్బాలాలో పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. పల్లెల్లో క్రీడామైదానాలు, ప్రకృతివనాలను పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని చూడాలన్నారు. తొండాల గ్రామంలో వివిధ పనుల నిమిత్తం ఖర్చుచేసిన నిధుల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.


క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా గుంత

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం, బిజ్జూర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో పాదాచారులు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. రోజు వేలసంఖ్యలో అవి వెళ్తుంటాయి. ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఆర్ ఏఈ: ఉదయ్‌కుమార్, సెల్: 72074 74442



బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న ఎసై సాయికుమార్

లోకేశ్వరం: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై సాయికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలిక సాధికారత– వారి భద్రతలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికలు అధైర్యపడవద్దన్నారు. ప్రమాదాన్ని ఎదుర్కొనేలా సమయ స్ఫూర్తి ఆలోచన కలిగి ఉండాలని చెప్పారు. హెల్ప్‌లైన్ నంబర్లు, చట్టాల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం రమేశ్‌కుమార్, గైడ్ టీచర్ నరేందర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ధని పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

సారంగపూర్: మన ఊరు–మనబడిలో భాగంగా మండలంలోని ధని ప్రాథమిక పాఠశాలకు నూతనంగా మంజూరైన భవన నిర్మాణానికి ఎంపీపీ మహిపాల్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భూమిపూజ చేసిన అనంతరం గ్రామంలో జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అడెల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, స్థానిక సర్పంచ్ లక్ష్మి, నాయకులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ సభను జయప్రదం చేయాలి

ఖానాపూర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈనెల 5న నిర్వహించ తలపెట్టిన బీఆర్‌ఎస్ సభను జయప్రదం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కోరారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ అధినేత కేసీఆర్ తలపెట్టిన సభ విజయవంతానికి ప్రతి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తరలిరావాలని కోరారు.

ఉపాధి పనులు ప్రారంభం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనులను సర్పంచ్ కనీస్‌ఫాతీమా ప్రారంభించారు. ఎంపీటీసీ కట్టరవి, ఫీల్డ్ అసిస్టెంట్ వాణి, తదితరులు ఉన్నారు.